పించినీ పుచ్చుకొన్న ఉద్యోగస్థుడు

శ్రీ పోరనంది జగన్నాథస్వామి

చదువరా, ఒకవేళ నీ అదృష్టవశమున నీ జీవితమందలి అమూల్యమైన భాగమంతా, అనగా నీ వీర్యవంతమైన యౌవనమంతా క్లేశావహమైన ఉద్యోగబంధనమందు వ్యయపరచేయుండినవో, నీకీ కారాగార దినములు నీ యౌవనముతో అంతమొందక నీ మధ్యమ వయస్సు దాటి పలిత జరాపరిణతాంగుడవైనను నిన్ను వదలక విముక్తి విరామాశ కలుగనీయకుండా విస్తరించినవో, సెలవులు అనే వస్తువొకటి ఉన్నాదని మరచిపోయో లేక ఉన్నట్లు తెలిసినా అవి చిన్నపిల్లలకు మాత్రమే హక్కు అని భావిస్తూనో కాలము గడిపియుండినవో, అట్టి స్థితిలో ఉండియున్నప్పుడు మాత్రమే నీవు నా విరామవిముక్తిని సానుకంపముతో ఆమోదించ గలుగుతావు.

ఆఫీసులో నేను ప్రవేశించి ముప్పైఆరు సంవత్సరములైనది. అప్పుడు నా జీవితములో సంభవించిన మార్పు చాలా ఖేదకరమైనది; కావలసినంత కాలము ఆటలక్రింద ఉపయోగించే స్థితినుండి, కావలసిన సెలవులు దొరుకుతూ ఉండే స్థితినుండి ఈ ఆఫీసు మేజా బల్లవద్ద రోజుకు పదిఘంటలు కూర్చోవలసిన స్థితికి సంభవించిన మార్పు చాలా క్లేశకరమైనది. కాని కాలము ప్రపంచములోని అన్ని ఖేదములనువలెనే దీనినికూడా భరించగలిగేటట్లు ఓదార్చింది. బోనులలో ఉండే అడవి మృగాలవలె నేనుకూడా క్రమంగా సంతుష్టుణ్ణి అయినాను; రానురాను దానియందు అభినివేశంకూడా కుదిరింది.

ఆదివారాలు సెలవులే. ఏ ప్రయోజనంకొరకు ఆదివారాలు సెలవులైనవోకాని, ఆటక్రింద విశ్రాంతి కొరకు ఆరోజు చక్కగా ఉపచరించదు. పట్టణంలో ఆదివారం ఒకవిధమైన విషాదంతో నిండియున్నట్లు తోస్తుంది. రోజూ అలవాటైన కేకలు, చప్పుడూ గడబిడ ఆదివారం ఉండదు; పెద్దపెద్ద దుకాణాలు మూసి ఉంటవి. ఆ వీధులలోకి వెళ్ల బుద్ధి పుట్టదు. మామూలు రోజులలో కనబడే బొమ్మలు, ప్రచురింపులు, అమ్మకముకొరకు దుకాణముల ముస్తాబులు, ఈవిధమైన ఆకర్షణములు ఏవియు ఆరోజున కానరావు. వీధులలో తిరిగేవానికి కులాసా ఏమీ ఆరోజున కలగదు. ఆనందముతో పుస్తకాల పుటలను త్రిప్పుతూ బొమ్మలు చూస్తూ దుకాణాలలో కాలక్షేపము చేసేవానికి ఆరోజున తోచదు. వీధులలో తిరుగుతూ పనులమీద సంచరించే వాళ్ల ముఖములను ఏకధ్యానముతో చూస్తూ కాలము గడిపే సోమరులకు ఆరోజున చికాకుగా ఉండును. పని లేక తిరిగేవానికి అంతటా సందడిగా ఉన్న వ్యాపారము ఒకవిధమైన వినోదముగా ఉపచరిస్తుంది. ఆదివారము నాడు వీధులలో కనబడేవాళ్లు కొంతమంది వాలాగే వారమంతా నౌఖరీచేసి విరామము అనుభవించడానికి అలవాటుపోయిన ముఖాలు కనబరుస్తూ తిరిగే నౌఖరీ కుర్రవాళ్లూ దాసీలున్నూ. ఆనాటి ఆహ్లాదము ఎంత శూన్యమైనదోగదా! తుదకు పొలాలలో తిరిగేవాళ్లు కూడా స్వాస్థ్యము లేనివారే.

ఆదివారాలే కాకుండా క్రిస్టమసుకు ఒకవారం, మరికొన్ని విడిసెలవులు దొరికేవి. క్రిస్టమసు వారములో నా స్వస్థలముకు వచ్చివేసేవాడను. ఈవారం నాకు ఒకవరము వుంటుంది. తిరిగీ సంవత్సరము ఆఖరున వస్తుందన్న ఆశ ఉండడముచేత ఆసంవత్సరం పొడుగునా ఆఫీసుఖయిదును సహింప నాకు శక్తి కలిగేది. కాని ఆ వారం రాగానే ఇదివరకు అది దూరంగా ఉన్నప్పుడు భాసిస్తూన్న ఆశ వాస్తవరూపమున నన్ను చేరేదికాదు. అన్నిరోజులనుంచీ ఆహ్లాదాన్వేషణములో వినియోగమైన వ్యాకుల సప్తవారముల పరంపరగా ఆసెలవుల వారముకూడా కనబడేది. సాధ్యమైనంత ఎక్కువగా

ఆనందించవలెననే ఆతురతవలన ఆవారము విసుగుపెట్టిన కాలమయేది. ఉంటుందనుకొన్న విశ్రాంతి స్థిమితాలు ఎక్కడా కానరావు. వాటివాసనైనా తగలటు. అవి మాయమైపోయేవి. సర్సి తిరిగీ నామేజాబల్లవద్ద నేను కూర్చున్నాను. మరొకమారు ఈ అవకాశము చేకూరే సరికి ఏభైరెండువారాలు విసుగుకొంటూ గడపవలసియున్నదిగదా అని లెక్క వేశాను. అది మళ్లా వస్తుంది గదా అనేఆశ నా కారుఅంధకారములో ప్రకాశించినది. అది భాసించకపోయినచో నా దాస్యములో జీవనధారణము అసంభవమై యుండును. ఆఫీసుకు వేళకు వెళ్లడము, రోజంతా అక్కడ ఉండడము ఈమొదలై కాఠిన్యము మాట ఉండగా, నేను ఈఉద్యోగవ్యాపారానికి తగను కాబోలు అనేసంశయము నన్ను ఆవేశించ ప్రారంభించింది. నాకు వయోవృద్ధి అయినకొలది ఇది నన్ను ఎక్కువగా బాధించడముచేత నావ్యాకులము నాముఖ రేఖలలో వ్యక్తమవుతూ ఉండేది. నా ఆరోగ్యము ఉత్సాహము క్షీణగుతుండేది. ఎప్పుడో అకస్మాత్తుగ ఉద్యోగ భంగము సంభవిస్తుందన్న భీతిన్ని, ఆసంకటమునకు నిలవగలిగినశక్తి నాకు చాలదన్న త్రాసమున్నూ నన్ను ఆవహించినవి. పగలంతా ఆఫీసులో గడిపి, తిరిగి నిద్రలో కూడా ఆ వ్యాపారమునే చేస్తూ, లెక్కలలో తప్పులు వచ్చాయనే భ్రమచేత వులిక్కిపడి లేస్తూ, మరునాడు ఆఫీసులో ప్రవేశిస్తూ ఇట్లు కొలువుచేశాను. ఏభైసంవత్సరాలు వయస్సుగడిచినా నాకు విముక్తిగలుగుననే ఆశ లేకపోయింది. నాఆఫీసు మేజాబల్లతో నేను ఐక్యము చెందిపోగా దానికర్ర నాహృదయదేశమును ఆక్రమించుకొన్నట్లైనది.

నా ముఖములో ఇట్లు వ్యక్తమయే ఇక్కట్టును జూచి, నాతోటివారు ఆఫీసులో నన్ను నానావిధముల చాలాసార్లు తర్కించేవారు. కాని నా యజమానికి మాత్రం ఇది గోచరమైయుండునన్న సందేహము నా కెప్పుడూ తట్టలేదు. ఒకనాడు నాయజమానులలో ఒకడు నన్ను ఒకమూలకు తీసుకొనిపోయి నా బాధకు కారణ మేమిటి అని నొక్కి నొక్కి ప్రశ్నించినాడు. తప్పించుకొందుకు సందు దొరకక నా అశక్తిని ఒప్పుకొన్నాను. "నా ఉద్యోగమునకు రాజీ ఇవ్వక తప్పదన్నట్లు ఉన్నదని భయపడుతున్నాను" అని నేను పలుకగా, నన్ను ఓదార్చుటకు అతడు ఏమేమో చెప్పెను. కాని నా ఒప్పుదలలోని అవివేకమును నేను విమర్శించుకొంటూ నాతొలగింపుఆర్డరు వస్తున్నట్లు నేను ప్రతిక్షణమూ జంకుతూ ఉంటిని. ఇట్లు ఒకవారము గడచినది. ఆహా! ఈవారము తలచుకొంటే — నాజీవితములో ఇట్లు బాధించిన కాలమును మనోవ్యాకులతను నేను ఎరగను. ఒకనాడు సాయంకాలము నామేజా తాళము వేసుకొని బయలుదేరుటకు కుర్చీనుంచి లేచేసరికి పెద్దయజమాని డఫేదారు వచ్చి మేడమీదికి రావలసిం దని పిలిచెను. ఆగది అంటే అందరికీ భయము. సరి. "నిన్ను డిస్మిస్ చేశాము" అని చెప్తారు. నా అనర్థానికి నేనే గదా కర్తను. "నీ అవసరము ఇక మాకు లేదు" అనిగదా చెప్తారు. నాకంగారు ఎరిగినయజమాని — వారంక్రిందట నన్ను పలుకరించినవాడు — నేను గదిలోనికి కాలుపెట్టగానే ఫక్కున నవ్వెను. అందువల్ల నావణుకు కొంచెము తగ్గుచుండగా, పెద్దయజమాని ఒక ఉపన్యాసము ప్రారంభించినాడు. నాసర్వీసు చాలా దీర్ఘమైన దనిన్నీ, నాపనిపాట్లు చాలా తృప్తికరముగా ఉండెననిన్నీ —నా కెప్పుడు అట్టిధైర్యము లేనిదే ఇత డెట్లు కనిపెట్టెనని నా ఆశ్చర్యం—, ఉద్యోగస్థులందరూ ఎప్పుడో ఒకనాడు విరామము కోరుట న్యాయమే అనిన్నీ— నాగుండె దబదబమని కొట్టుకొంటూ ఉన్నది — ఏమేమో ఇట్లు తనవాగ్ధాటిని చెప్పి ఉపన్యాసము ముగించి నా ఆస్తి ఆర్జనలగురించి ప్రశ్నలు వేసెను. "నీవు చేసిన నౌఖరీకి సంతోషించి నీకు నీ జీతములో మూడువంతులలో రెండువంతులు పించినీగా ఇచ్చుటకు మేము నిర్ణయించినాము; దానిని నీవు స్వీకరించి విరామసౌఖ్యమును అనుభవించుమని మామనఃపూర్వకప్రార్థన" అని చెప్పి ఉపన్యాసమును అతడు ముగించగానే— ఏమి ఔదార్యము! విస్మయకృతజ్ఞతలమధ్య ఊగులాడుతూ ఉండిన నాహృదయమునుండి నా అంగీకారవాక్కులు ఎట్లు వెడలినవో నాకు జ్ఞప్తిలేదు. ఆ మరునాటి ఉదయమునుండి నాదాస్యవిముక్తి. యజమానునికి కృతజ్ఞతావందనములు చేసి గది విడిచాను.

ఆఫీసునుండి ఇంటికి వెళ్లడము అదే ఆఖరిసారి. ఆ ఉదారుని నామము శాశ్వతముగ నిలిచియుండుగాక.

ఒకటి రెండు దినములవరకు దిమ్మపట్టి, ఆకులమొంది, నాకు కలిగిన సౌఖ్యమును తెలుసుకోలేకుంటిని. నేను సుఖపడ్డానని బోధపడినా నాకు సౌఖ్యముమాత్రము కలుగలేదని పోల్చి ఇటూ అటూ తిరిగినాను. నలభైవర్షములు కారాగృహనివాసము చేసిన వానిని అకస్మాత్తుగ ఒకనాటి ఉదయం బయటకు పంపివేస్తే ఎట్లుండునో అట్టిస్థితిలో నేను ఉంటిని. నన్ను నేను నమ్మలేకుంటిని. ఈ కాలప్రవాహమునుండి అనంతములోనికి వెళ్లిపోయినట్లున్నది; కాలమంతా తన స్వాధీనములో ఉన్నప్పుడు అది అనంతమేగదా! నేను వినియోగించగలిగినదానికంటె చాలాసార్లు అధికమైనకాలము నా స్వాధీనమందుండెను. కాలమనే ధనములేని రిక్తుని నన్ను అకస్మాత్తుగా ఒక్కమారు ధనవంతునిగా మార్చినది ఈస్థితి. నా ఆస్తికి క్షయము లేదు. ఈ ఆస్తిని వ్యవహరించుటకు తగిన గుమస్తా ఒకడు అవశ్యకమాయెను. కాబట్టి ఉద్యోగము చలాయిస్తూఉండేవారి కందరికి ఇందుమూలముగా ఒక తత్వమును బోధపరుస్తున్నాను: ఆలోచించుకోకుండా, చులకనగా తనకున్న సాధనసామగ్రి ఎంతవరకు సరిపడునో విమర్శించుకోకుండా ఎవరూ తననిత్యవృత్తినుండి విరమించకూడదు; అట్లు చేసినచో ఒకప్పుడు ప్రమాదము సంభవించవచ్చును. నాకుమాత్రము చాలినన్ని సాధనోపాయము లున్నట్లు తెలుసును. ప్రప్రథమమున ఉద్భవించిన హర్షోన్మాదము చల్లారగా, శాంతమైన స్వగృహసౌఖ్యము నాకు కలిగింది. తొందర అనునది మరి లేదు. అన్నీ సెలవుదినములు అగుటచేత నాకు వేరే సెలవులు లేవు. కాలము భారము అయినప్పుడు ఇటు అటు తిరిగి దానిని ఖర్చుచేయగలను. కాని పూర్వమువలె (అనగా ఆక్షణిక విరామదినములలోవలె) రోజుకు ముప్ఫైమైళ్లచొప్పున— వీలైనంత అధికముగా ఆనందించవలె ననేకోరికతో—రోజంతా నడవలేను. కాలము బరువైతే చక్కగా చదువుకోగలను; కాని పూర్వమువలె (అనగా నా కాలము అనేకాలము నాకు దొరకని రోజులలోవలె) రాత్రి దీపము పెట్టినతరువాత నా మెదడును కళ్లను శ్లేశపెట్టి తొందర తొందరగా చదవలేను. ఉత్సాహము కలిగినప్పుడు చదవడమో, వ్రాయడమో, నడవడమో నా కిష్టమువచ్చినట్లు చేస్తూఉంటాను. ఆహ్లాదముకొరకు వెదికి వెంబడించలేదు; నా కొరకు అది రావలెను. ఏనిర్జనస్థలములోనో పుట్టి పెరిగిన వానికి సంవత్సరాలు ఎట్లు వాటిఅంతట అవి వచ్చునో అట్లే నాకు ఇప్పుడు అవి ఉంటవి. ఏభైఅయినాయి ఇంకా సంవత్సరాలు లెక్కిస్తున్నాడా ఈ వయోతీతుడు, పించినీదారుడు!

నిజమే. ఏభై గడిచినవి; కాని పేరుకేగదా. నా కొరకుగాక ఇతరులకొరకు నేను ఖర్చుచేసిన కాలము ఈ ఏభైనుండి కొట్టివేస్తే, ఆ మిగిలిన కాలమే నా గడచినవయస్సు. అందుచేత నేను చిన్నవాడినే! ఏకాలమంతా తన క్రిందనే వినియోగమవుతుందో, అదే వాస్తవముగా వానివయస్సు. ఏదో ఒక అర్థములో నా డాకాలమును గడిపియున్నా, అది ఇతరులకాలము గాని వానికాలము కాదు. నాకు ఇప్పుడు మిగిలియున్న వయస్సు తక్కువో ఎక్కువో. నా లెక్కలో దానిని మూడింతలుగా గుణించవలెను. ముందువచ్చే పదివత్సరాలు గతించిన ముప్పైవర్షములంత దీర్ఘములుగ గడుస్తవి. సరళమైన త్రైరాశిక గుణితమేగదా!

నా స్వతంత్రతా ప్రారంభదశలో నన్ను ఆక్రమించుకొన్న మనఃకల్పనలలో ఒకచిత్రమైనదీ, ఇప్పటికీ కూడా నన్ను విడవనిదీ ఒకటి కలదు. నేను నా ఉద్యోగమును విడిచిననాటినుండి ఒకవిస్తీర్ణమైన కాలభాగముమధ్య ప్రవేశించినట్లు నాహృదయములో ఒక భావన పుదయించినది. అది నిన్నటి మొన్నటి విషయమువలె స్ఫురించదు. అనేకసంవత్సరాలు ప్రతీరోజూ, అనేకఘంటలూ, కలిసి మెలిసి సంచరించిన నా తోటి గుమస్తాలు, నా యజమానివర్గమువారు హఠాత్తుగ నాకు దూరము కాగానే, వారు ఎంతోకాలముక్రిందట మరణించినవారివలె నాకు స్ఫురించిరి.

“నా డిపుడేగదా వెడలెను. కన్నీరు విడుచుటకైనా వేళలేకుండెను. అయినా మమ్ము ఎడబరచినదూరము ఎన్నో వర్షశతంబులవలె సు.

మచున్నది: అనంతమైనదానికి కాలమానము వర్తిల్లదుగదా!"

అని ఒకకవి ఇటువంటి అనుభవమును వర్ణించెను.

ఈ వింతయైన భావముయొక్క తీవ్రతను తగ్గించాలని వారందరిమధ్యకు వెళ్లవలెనని ఒకటి రెండుమార్లు ఉద్యుక్తుడనైనాను. అధోలోకమున పోరాటముమధ్య నేను విడిచివచ్చినవారి నందరిని ఒకమారు చూడవలెననే బుద్ధి పుట్టింది. వెళ్లి వారిమధ్య నిల్వగా, ఇదివరకు ఆనందించుచుండిన పరిచయమాధుర్యమువా రెంత గౌరవముతో ఆదరించినా, నా హృదయమున ఉద్భవించలేదు. మా పాతహాస్యములు చేసుకొన్నా అవి నిస్తేజములుగ ఉండెను. నా మేజాబల్ల, నాటోపీ కొయ్య మరొకరి అధీనములైనవి. అట్లు కావలసినదే అని నాకు తెలిసినా నాకది ఇష్టముకాకుండెను. ముప్పై ఆరు సంవత్సరాలు హాస్యములతోను పొడుపుమాటలతోను నా ఉద్యోగవైషమ్యములకు సమతను కలుగజేసిన నాతోటి ఉద్యోగస్థులను (నా విశ్వాసమును సంపాదించిన అనుచరులను) నేను విడిచివేయునపుడు నాకొక అపూర్వవేదన కలిగింది; కలగనంత పశువును కానుగదా! నా ఉద్యోగము అంత విషమమైనదా లేక నేను అంత పిరికినా? ఏదైనా పశ్చాత్తాపమునకు వేళ మించినది. అదిగాక ఇట్టి ఊహలు అట్టిసమయములలో విజృంభించడము మనస్వభావము. నా హృదయము మాత్రము వ్యథనొందినది. మా స్నేహబంధనములను నేను బలాత్కారముగా త్రెంపివేశాను. అది సౌజన్యము కాదుగదా! ఈ వియోగస్థితికి నేను సర్దుకొనేసరికి కొన్నాళ్లు పట్టినది. స్నేహితులారా సెలవు. తిరిగి తిరిగి వస్తూయుంటాను మీ దయ ఉంటే. పొడుపుమాటలు ఆడినా చక్కనిస్నేహము చూపేవాడవు నీవు కృ—, మందమైనా మర్యాదచేసేవాడవు నీవు రా—, అన్నిట్లోను చెయ్యిపెట్టినా సహాయము ఇచ్చేవాడవు నీవు న—, మీ అందరివద్ద సెలవు! లెక్కలేని దారులు, సందులు, చీకటిగదులు, సూర్యరశ్మి ఎరగని మూలలు,— వీటితో నిండియుండి, ఆకాశమునందుకొనుటకు ఎత్తు అగుచున్న శిఖరము దుర్గమాఅన్నట్లు ఉన్నగోడలు, బురుజులు — ఇట్లు నిర్మింపబడిన నా ఆఫీసుభవంతి, అనారోగ్యమైనా క్షేమసంపాదకమైనదిన్నీ, కఠినమైన నా జీవనపోషకమైనదిన్నీ ఆభవనము: నీవద్ద సెలవు. నీవద్ద ఉన్నవి నాకృతులు, పుస్తకవ్యవహారకునివద్ద లేవు. నేనెట్లు పరిశ్రమనుండి విశ్రాంతి పొందినానో ఆ కృతులుకూడా అక్కడ విశ్రాంతి పొందుతూ ఎంతఉపయోగమో అంత అసంఖ్యాకములై నిండుగా బీరువాల బల్లలపై ఉండుగాక. ఆ నా ఆస్తిని నా ఆర్జనయైన నా తేజఃప్రభావమును మీ కందరికి అప్పగిస్తున్నాను.

ఒకపక్షము గడిచినది. అప్పటికి శాంతిని చవిచూసినా పూర్తిగ పొందలేదు. నేను నిశ్చలమైన విశ్రాంతి అని విజ్ఞప్తిగానుకాని అంత పూర్ణమైనది కాదు. ఆరంభమందు కనబడిన ఆ వేగము నిలిచియుండిపోయింగా ఆకులపరచునూతనత్వ, అలవడని తేజస్సువలన నీర్వీర్యమైన నేత్రములు నాకు అలవాటైన దుస్తులు వేసుకోకపోవడము నన్ను వ్యాకులపరుస్తూ ఉండెను. తీవ్రసన్యాసశిక్షకు అలవాటుపడిన బైరాగి హఠాత్తుగ సంసార ప్రపంచమందు విడవబడినట్లు నేనుంటిని. నా అధికారిని నేనే. నా కిష్టమైనచోటికి వెళ్లడము, నా కిష్టమైన పని చేయడము. సింగరేణివీధిలో ఉదయము పండ్రెండు గంటలవరకూ ఒకనాడు తిరగగానే ఈ విధంగా ఎన్నో సంవత్సరాలనుండీ ఈలాగే తిరుగుతూఉండేవాణ్ని అని తోచింది వెల్లింగ్టను బజారులోనికి వెళ్లి పాతపుస్తకాలు వెదికేవాడిని; ఈ విధంగానే ముప్పైసంవత్సరాలనుంచి చేస్తూఉండేవాడినని తోచేది. అందుచేతనే ఈ వెళ్లడంలో క్రొత్త కనబడలేదు. ఒకనాడు ఉదయము ఒక చక్కని బొమ్మను చూస్తూ నిలుచున్నాను; మరొకలాగు మరియెప్పుడైనా చేసేవాడినా అని అనిపించింది. పూర్వము నాయింటినుండి ఆఫీసుకు వెళ్లే వీథులన్నీ ఇప్పు డేమైనవో! ఆవీథులరోడ్డులోని రాళ్లు ఇప్పుడు ఏ శ్రమకర్షితోద్యోగుని పాదహతములకు ప్రతిధ్వని నిస్తున్నవో! నా స్థితిలో గలిగిన ఈ మార్పును అన్యలోకోత్క్రమణముతో సరిపోల్చినచో, అది ఉత్ప్రేక్షగా ఎవరికీ తోచకూడదు. కాలము నా విషయమై నిశ్చలనమై యున్నది. కాలభేదములు నాకు మాపుఅయిపోయినవి. దినము వారము

తేది మొదలైన మార్పులు నాకు పరాకైనవి. పూర్వము శనివారం సెలవైన ఆదివారమునకు సన్నిహితమగుట చేత ఒక భావవిశేషముతో సమ్మిళితమై యుండేది. అప్పుడు ప్రతిరోజూ ఒక ప్రత్యేకవ్యక్తివలె భాసిస్తూ ఉండేది. రాబోయే ఆదివారంనాటి వినోదములకు అడ్డుగావున్న బరువువలె ప్రతిరోజూ కనబడుతూ ఉండేది. ఒకటి ఆరురోజుల బరువుగలది, ఒకటి ఐదురోజుల బరువుగలది; ఇట్లు ఉండేది—ఆ రోజులరూపం నాభావనలో. అసలుపును ఇప్పటి తెలుపుగా మార్చ గలిగిన గారిడీ యేదో! ఆదివారం తరువాత వచ్చిన సోమవారం అన్నిటికంటె ఎక్కువ నలుపైనది. ఇప్పుడో అన్నిరోజులు ఒక్కటే. తుదకు ఆఆదివారము కూడా — సాధ్యమైనంత అధిక సంతోషమును సంగ్రహించవలెనని నేను పడిన ఆతురతవలన కాలం అతి చంచలమై విరామదివసముగా విఫలమైన ఆ అభాగ్యపు ఆదివారము — ఇప్పుడు సాధారణదివసమైపోయినది. దేవాలయమునకు వెళ్లితే, అనుభవించగలిగిన వినోదపు మొత్తములో లోపమువస్తుందనుభీతి ఇప్పుడు మరిలేదు. ఏ పని చెయ్యాలన్నా కాలము వున్నట్లు తోస్తుంది. చాలా తొందరపనిలోవున్న ఎవనితోనైనా నాకు కావలసినంత సేపు ముచ్చటలాడగలను. షికారు వస్తావా అని పిలిచేవానికి తిరస్కారము చేయగలను. క్లేశపడుతూ పనులు చేసుకొనేవాళ్లను (నేను విడిచివేసిన నాతోటి వారిని) చూస్తూ వారి బాధలకు విపరీతానందనము పొందుతున్నాను. తిరిగే చోటునే తిరిగే గానుగ ఎద్దులవలె పనిచేస్తున్న వాళ్లు వారందరూ: ఎందుకొపని! ఎవడికీ కాలము అత్యధికంగాకాని అత్యల్పంగాకాని వుండకూడదు. నాకు ఒక కొడుకు వుంటే వాడికి "పనిలేనిమనిషి" అని నామధేయంచేసి, వాడే పనీ చేయకూడదని నియమించియుందును. పనిచేస్తున్నంతసేపూ మనుజుడు తన స్వాభావిక మార్గమునుండి దారి తప్పినవాడు. పురుషుడు స్వభావమువల్ల విచారణశీలుడు, వ్యాపారశీలుడు కాడు. ఒక భూకంపం వచ్చి ఆ మిల్లుల నన్నింటినీ మ్రింగివేయదా! ఆ మేజాబల్లను తీసుకొనిపోయి పిశాచములుండే అధఃస్థలములో పారవేయండి.

ఆ! నేను ఆ కంపెనీ గుమాస్తాను కాను. నేను విరమించిన విశ్రాంతిని! చక్కని ఉద్యానములో నేను ఎవరికైనా దొరుకుతాను. నాశూన్యముఖము నిరవధాన చేష్టవలన, ఏనిశ్చితకార్యము లేక తిరిగే నేను అందరికీ సుపరిచితుడను అయినాను. ఇటూ అటూ తిరుగుతాను. అంతేకాని ఒకస్థలమునుండి మరొకస్థలమునకు కాదు. ఇన్నాళ్లూ నాలోపల మరికొన్ని మంచి గుణములతో పాటు అణిగియుండిపోయిన ఆత్మగౌరవదృష్టి ఇప్పుడు నా ఆకృతిలో పొడమూపడము ప్రారంభించిందని అందరూ అనేవారు. ఆర్యతాస్థానమునకు ప్రత్యక్షముగా మారిపోతున్నాను. నే నిప్పుడు వార్తాపత్రిక చదివితే, నాటకరంగములస్థితి తెలుసుకొనుటకు మాత్రమే. నా వ్యవహారము, వ్యాపారపు జీవితము పూర్తిఅయిపోయినది. నేను ఎందుకు ఈ ప్రపంచములోనికి వచ్చినానో అది చేసివేసినాను. కష్టమైన నౌఖరీ చేసితిని, ఇంకో జీవితపు కాలమంతా నాఇష్టమే కదా.